లక్ష్మీగూడ పోచమ్మ దేవాలయ భూమిపూజ



లక్ష్మీగూడ పోచమ్మ దేవాలయ భూమిపూజలో దేవాలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడలో కొత్తగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించామని త్వరితగతిన పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్.రఘుపతి ముదిరాజ్, దారముని రమేష్‌ముదిరాజ్, నర్సింహముదిరాజ్, ఎస్.శంకర్, రఘుసాగర్, నాగేష్‌గౌడ్, నర్సింగ్‌రావు, మహేందర్‌ముదిరాజ్, బాలరాజ్‌ముదిరాజ్, విగ్నేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు అంతా సిద్ధం



ముస్తాబైన బడీమజీద్

శాస్త్రిపురం: రంజాన్ పండుగకు రాజేంద్రనగర్ ప్రాంతం ముస్తాబైంది. సోమవారం రంజాన్ పండగ ప్రార్థనలకు ఈద్గాలు, మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం వేళలో పెద్దఎత్తున ముస్లింలు ఆయా ప్రాంతాల్లో ప్రార్థనలు చేయనున్నారు.

ముస్తాబైన ఈద్గాలు

గోల్కొండ: రంజాన్ ప్రార్థనల కోసం కార్వాన్ నియోజకవర్గంలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి. పాంచ్‌ఖానా ఈద్గా, కుతుబ్‌షాహీ ఈద్గా, హకీంపేట్ ఈద్గాలతో పాటు గోల్కొండలోని ఒవైసీ ప్లే గ్రౌండ్‌లు ప్రార్థనలకు ముస్తాబవుతున్నాయి. మరోవైపు మాసాబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్ ఈద్గా, అహ్మద్‌నగర్‌లోని జామా మసీదుతో పాటు మెహిదీపట్నం, టోలిచౌకీ, గోల్కొండలోని ప్రధాన జామా మసీదులు రంజాన్ ప్రార్థనలకు ముస్తాబవుతున్నాయి. నగరంలో అతిపెద్ద ఈద్గాలలో ఒకటైన కుతుబ్‌షాహీ ఈద్గాను సంస్కృతిక పర్యాటక శాఖ అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఈద్గాల వద్ద తాత్కాలిక ప్రాతిపదికన వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడు అన్ని ఈద్గాల వద్ద టెంట్లు వేసి బయోటాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒవైసీ ప్లే గ్రౌండ్‌ను చదును చేసి అక్కడ వ్యర్థాలను తొలగించి ప్రార్థనలకు ముస్తాబు చేశారు. అదే విధంగా లంగర్‌హౌస్‌లోని పాంచ్‌ఖానా ఈద్గాలో కూడా రంజాన్ ప్రార్థన ఏర్పాట్లు చివరి దశలో ఉన్నాయి.

వసంత నవరాత్రి ఉత్సవాలు ఆరంభం

రాయదుర్గం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ఆదివారం విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సీతారాముల ప్రత్యేక పూజలను స్థానిక లక్ష్మణ్‌బాగ్ మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆదివారం ఆరంభమైన ఈ ఉత్సవాలను ఏప్రిల్ 6వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. అదే రోజు ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలు, కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉగాది వేడుకలు



సంకటహర హనుమాన్ దేవాలయంలో పూజలు



హైదర్షాకోట్‌లోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో పంచాంగాన్ని వినిపిస్తున్న పండితులు



బాబుల్‌రెడ్డినగర్‌లో పచ్చడి పంపిణీ చేస్తున్న నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి



ఉగాది సందర్భంగా బండ్లగూడలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న మురళీకృష్ణ, రమేష్



రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని శివాంజనేయ స్వామి ఆలయంలో..



బుద్వేల్ టీచర్స్ కాలనీలో పంచాంగ పఠనం



కన్మణి వెల్నెస్ సెంటర్‌లో ఉగాది ఉత్సవాలు

ఉచిత మెగా వైద్య శిబిరం



చిత్రపురి కాలనీలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కాదంబరి కిరణ్

మణికొండ: కాదంబరి ఫౌండేషన్–మనం సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షుర్ సంస్థ వారి సీఎస్ఆర్ సౌకర్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలోని ఎల్ఐజీ ప్రాంగణంలో రెనోవా హాస్పిటల్ విద్యానగర్ వారి సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి, దంత, బీపీ, హార్ట్, బీఎంఐ, కేన్సర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నటుడు వినోద్‌బాల, ఎల్ఐజీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, పలువురు నటీనటులు, వివిధ శాఖల సినీ కార్మికులు పాల్గొన్నారు.

భవానీ కాలనీలో పార్కు ప్రారంభం



భవానీ కాలనీలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. 8వ డివిజన్‌లోని భవానీకాలనీలో ఉగాది పండుగను పురస్కరించుకొని కమ్యూనిటీ పార్కును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీ కాలనీ ఏర్పడి దాదాపు ఐదు సంవత్సరాలు గడిచిందని, గతంలో మౌలిక సదుపాయాల లేక కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో మాజీ కార్పొరేటర్ భూపాల్‌గౌడ్ కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశానన్నారు. కాలనీలో పార్కు స్థలం, ఆలయ స్థలం, వాటర్ ట్యాంక్ స్థలాలను కబ్జా కాకుండా కాపాడినట్లు చెప్పారు. పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, సురేష్‌గౌడ్, భూపాల్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, పాపయ్యయాదవ్, సుమన్‌గౌడ్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవ పత్రిక ఆవిష్కరణ



మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం సభ్యులు

అత్తాపూర్: హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీలోని ఆలయంలో మల్లన్న స్వామి కల్యాణం పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. కురుమ కులస్తుల సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మొంగ్ర నర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 20వ తేదీన మల్లన్న కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మొంగ్ర గౌరీశంకర్, సులిగే వెంకటేష్, మల్లన్న స్వామి కమిటీ అధ్యక్షుడు కాడెం నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఎస్.మహేందర్, బి.శ్రీనివాస్, ఎస్.రమేష్, పూర్ణచందర్, ఎస్.రాజు, బండారు రమేష్, బి.హరినాథ్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రూ.153.90 కోట్లకు ఆమోదం



మాట్లాడుతున్న కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శ్రీధర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్యాలయంలో ఆర్థిక సంవత్సరం 2025–26 అంచనా బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారి పి.శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆర్థిక సంవత్సరం 2025–26 అంచనా బడ్జెట్‌ను రూ.153.90 కోట్లుగా ప్రత్యేక అధికారి ఆమోదించారు. నెలసరి జీతాలు రూ.8.21 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణ రూ.15.76 కోట్లు, విద్యుత్ బిల్లులు రూ.3.88 కోట్లు, హరిత నిధి రూ.6.36 కోట్లు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.23.57 కోట్లు, సాధారణ పరిపాలన విభాగంలో వివిధ ఖర్చులు రూ.3.56 కోట్లు, టౌన్ ప్లానింగ్ విభాగంలో వివిధ ఖర్చులు రూ.0.41 కోట్లు, 1/3 వంతు నిధులు మిగులు వ్యయం రూ.4.35 కోట్లు, ప్రజా సౌకర్యాల ఖర్చులు రూ.6.83 కోట్లు, వార్డు వారీగా వివిధ అభివృద్ధి పనుల ఖర్చులు రూ.79.55 కోట్లుగా ఆమోదించారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, వివిధ సెక్షన్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈవోలు, ఆర్పీలు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు బీజేపీ కోసం పని చేయాలి

గోల్కొండ: ప్రతి కార్యకర్తా బీజేపీ కోసం పని చేయాలని అటువంటి వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి ఆదివారం ఆయనను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ వర్గాలన్నీ కలిసికట్టుగా పని చేయడం వల్లే రాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ మెజార్టీ సాధించిందన్నారు. ఎమ్మెల్సీ రెండు సీట్లు తమ పార్టీ గెలుచుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: సమస్యల పరిష్కారం కోసం గ్రేటర్ అల్కాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభించామని అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్కాపూర్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అసోసియేషన్‌లో చేరవచ్చని స్వాగతించారు. ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఉగాది పండుగ రోజు శుభ సూచకంగా 750 మందితో అసోసియేషన్‌ను ప్రారంభించామన్నారు. కమ్యూనిటీ వెల్ఫేర్ కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. అల్కాపూర్‌లో ప్రజలు దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక చిన్న చెరువులో గుర్రపుడెక్క పెరిగిందని, అధికారులు దానిని తొలగిస్తే దోమల బెడద తప్పుతుందన్నారు. అల్కాపూర్ కాలనీలో భూకబ్జాలను అడ్డుకుంటామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ తణుకురి, ఉపాధ్యక్షుడు వినరతి సురేష్, ఎంఆర్ఎస్ దిలీప్, కిరణ్‌కుమార్, పురుషోత్తంరావు, శ్రీధర్, శ్రావణ్‌కుమార్, చిరాన్ జిత్ గోష్, అనుపమ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చెరువు కలుషితం.. ఏదీ కనికరం..?

- వ్యర్థాలతో నిండిపోతున్న మీర్‌ఆలం చెరువు
- ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక కాలనీల ప్రజలు





మీర్‌ఆలంచెరువులో పెరిగిన గుర్రపుడెక్క

శాస్త్రిపురం: ఒకప్పుడు తాగునీటిని అందించిన మీర్‌ఆలం చెరువు ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుర్రపుడెక్కతో నిండిపోయింది. సులేమాన్‌నగర్ డివిజన్ సెట్విన్ కాలనీకి ఆనుకొని ఉన్న మీర్‌ఆలం చెరువు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. పిచ్చిమొక్కలకు ఆవాసంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువులోని నీరు పూర్తిగా ఆకుపచ్చ రంగులోకి మారి దుర్గంధం వెదజల్లుతోంది. చెరువులో బట్టలు ఉతకడం, పశువులను కడగడం చేస్తుండటం, పక్కనే ఉన్న కాలనీల నుంచి మురుగు చెరువులో కలుస్తుండటంతో చెరువు కలుషితం అవుతోంది. చెరువు కబ్జా కాకుండా, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. చెరువును కాపాడాలంటూ చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఎన్నో ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా జంతు కళేబరాలు, వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

జూ పార్కులోని జంతువులకు కలుషిత నీరు

జూపార్కులోని జంతువులకు సైతం మీర్‌ఆలం చెరువు నీళ్లే అందిస్తున్నారు. ఇంతటి కలుషితమైన నీటిని జంతువులకు అందిస్తే అవి రోగాలకు గురికాక తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు చెరువులో చేరకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కాలనీ వాసులు రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు విన్నవించారు. ఆ సమయంలో హామీ ఇచ్చిన అధికారులు చేతులు దులుపుకున్నారు. పైప్‌లైన్లు పూర్తిగా చెరువులోకి ఉండటంతో మురుగు చెరువులోకి చేరుతోంది.

శిథిలావస్థకు చేరుకున్న ఫెన్సింగ్..

ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తుప్పు పట్టి పలుచోట్ల విరిగిపోయింది. మరికొన్ని చోట్ల ఫెన్సింగ్‌ను కట్ చేసి దొంగిలించారు. దీంతో యువకులు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న వైనం..

వివిధ ప్రాంతాల నుంచి తీసుకువస్తున్న చెత్తాచెదారం, వ్యర్థాలను అక్కడ డంప్ చేస్తుండటంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. పలు హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను రాత్రివేళలో తీసుకువచ్చి చెరువులో పడేస్తున్నారు. చెరువు పూర్తిగా కలుషితం కాకముందే ఉన్నతాధికారులు స్పందించాలని స్థానిక కాలనీల ప్రజలు కోరుతున్నారు.